క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

డోన్ టౌన్: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్లు గ్రేస్ సెలస్టియల్, మాధవి, రాజారావు, రెహమాన్ అన్నారు. స్వస్థనారీ, సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌లో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మహిళలు, కిశోర బాలికలకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య సూత్రాలు తెలియజేశారు. అనంతరం ఆయుర్వేదం, యూనాని మందులను పంపిణీ చేశారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం బలంగా ఉంటుందని పేర్కొన్నారు.

దరఖాస్తులో తప్పిదాలకు అస్కారం ఉండొద్దు


సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంవీఐ

డోన్ టౌన్: వాహనమిత్ర దరఖాస్తులో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నమోదు చేయాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ అన్నారు. శుక్రవారం డోన్ మండలం ఉడుములపాడు గ్రామ సచివాలయంలో వాహనమిత్ర పథకం దరఖాస్తు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నమోదులో ఏవైనా సమస్యలు తెలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ


పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది


బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీసేవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

మహిళలకు వైద్య సేవలు


మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బేతంచెర్ల: శేషారెడ్డి సీహెచ్‌సీలో శుక్రవారం మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కమిషనర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ''ఆరోగ్యమే మహాభాగ్యం'' అన్న నినాదంతో ప్రతి మహిళ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు శబరీష్, అహ్మద్, మృదుల, ఇర్ఫాన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అరటి సాగులో ఆధునిక పద్ధతులు అవసరం


శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

బేతంచెర్ల: మండలంలోని యంబాయి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మహానంది మండలం ప్రధాన శాస్త్రవేత్త కిశోర్ అరటి సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక దిగుబడులు పొందాలంటే సస్యరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉద్యానశాఖ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

సురవరం ఆశయాలను సాధిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

డోన్ టౌన్: భారతదేశంలో శ్రమ దోపిడిలేని సమాజం కోసం పాటుపడిన కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ నేతలు పిలుపునిచ్చారు. డోన్‌లో జరిగిన స్మృతిసభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, రామాంజనేయులు, జిల్లాకార్యదర్శి రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు. మాజీ సీఎం కోట్లపై సురవరం డోన్ నుంచి పోటీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- విద్యార్థులకు నేషనల్ స్కాలర్‌షిప్ ద్వారా ఏడాదికి రూ.12 వేలు
- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం
- ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుకు ఈ నెల 30 వరకు గడువు
- ప్రభుత్వ విద్యార్థులకు మాత్రమే అవకాశం


విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు


బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాతీయ ప్రతిభా ఉపకార ఎంపిక పరీక్ష (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)– ఎన్‌ఎంఎంఎస్ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ వరకు నాలుగు సంవత్సరాలపాటు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది. అయితే విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే చదవాల్సి ఉంటుంది. గత ఏడాది ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసి కర్నూలు జిల్లా నుంచి 281 మంది, నంద్యాల జిల్లా నుంచి 162 మంది విద్యార్థులు ఉపకార వేతనానికి అర్హత సాధించారు. ఈ ఏడాది పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉంది.

దరఖాస్తు ఇలా

రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు జిరాక్స్ కాపీలను జిల్లా విద్యాశాఖ అధికారులకు అందజేయాలి. ఫీజును ఎస్‌బీఐలో చలానా రూపంలో చెల్లించాలి.

పరీక్ష ఫీజు: జనరల్, బీసీ వర్గానికి రూ.100, ఎస్సీ, ఎస్టీ వర్గానికి రూ.50.
పరీక్ష తేదీ: డిసెంబరు 7.
అర్హత: తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.5 లక్షల లోపు ఉండాలి.

పరీక్ష విధానం:

ఈ పరీక్ష రెండు విభాగాలుగా నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లీష్ మధ్యమాల్లో ఉంటుంది. మొదటి విభాగంలో విద్యార్థుల సమర్థ్యాన్ని అంచనా వేసే మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్ ప్రశ్నలు ఉంటాయి. రెండో విభాగంలో 7వ, 8వ తరగతుల సైన్స్, సోషల్, గణిత శాస్త్రంపై ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో విభాగానికి సంబంధించి 90 ప్రశ్నలతో మొత్తం 180 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. మూడు గంటల సమయం ఇస్తారు. విద్యార్థులు కొద్దిగా కష్టపడితే ఎన్‌ఎంఎంఎస్‌లో విజయం సాధించవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆసక్తి ఉన్న విద్యార్థులకు గణితం, సైన్స్, సోషల్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు మాత్రమే ఎన్‌ఎంఎంఎస్ ఉపకారవేతనానికి అవకాశం ఉంది. మండలంలో ఎక్కువ మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలి. కొద్దిగా కష్టపడితే ఈ పరీక్షలో విజయం సాధించడం విద్యార్థులకు కష్టమేమీ కాదు. ఇప్పటికే పలు పాఠశాలల్లో గణితం, సైన్స్, సోషల్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలన్నదే మా ధ్యేయం. –స్వరూప, ఎంఈఓ, బనగానపల్లె

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె రూరల్: బనగానపల్లె, పాతపాడు, పసుపల సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. రైతులకు సరఫరా చేసే విద్యుత్ ఉదయం 4 నుంచి 9 గంటల వరకు.. మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు.

- **బేతంచెర్ల:** మండలంలోని సిమెంట్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ మధుసూదన్‌రెడ్డి, ఏఈలు శివన్న, శ్రీనివాసులు తెలిపారు. ఆర్‌ఎస్ రంగాపురం సబ్‌స్టేషన్ మినహా బేతంచెర్ల పట్టణం, మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, పరిశ్రమల యజమానులు గమనించాలన్నారు.

లారీ బోల్తా

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ సమీపంలో శుక్రవారం డోన్ వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు జేసీబీ సాయంతో లారీని పైకి లేపే పనులు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పరామర్శ


గౌండ బాలరాజును పరామర్శిస్తున్న బుగ్గన

బేతంచెర్ల: రుద్రవరం గ్రామంలో గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గౌండ బాలరాజు, గోవిందు, చంద్రశేఖర్, దాసరి పుల్లయ్య, ఎంపీటీసీ నాగేశ్వరరావును మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందిస్తానని హామీ ఇచ్చారు. అధైర్య పడొద్దని.. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. స్థానిక మహిళలు సమస్యలను వివరించగా, మూడున్నరేళ్లు ఓపిక పట్టాలని.. ఆ తర్వాత సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భోగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, సీతారామాపురం, ఎంబాయి సర్పంచ్‌లు యుగంధర్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ నారాయణ, పార్టీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, రామచంద్రుడు, ప్రసాద్‌రెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి, గూని నాగరాజు, మౌలాలి, బాలుడు, నాగేష్, ఎద్దులన్న, భోగప్ప ఉన్నారు.

శుభకార్యం

పట్టణానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ ముల్లా సయ్యద్ కుమార్తె సునైన, మహమ్మద్ సమీర్ వివాహం బేతంచెర్ల షాదిఖానాలో శుక్రవారం జరిగింది. వివాహానికి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నాయకులు బాబుల్‌రెడ్డి, మూర్తుజావలి, ఖాజా, బుగ్గన చంద్రారెడ్డి, రామచంద్రుడు, గూని నాగరాజు తదితరులు ఉన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం



వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులను అడ్డుకున్న పోలీసులు, బేతంచెర్ల: పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న డోన్ జెడ్పీటీసీ రాజ్ కుమార్

బేతంచెర్ల: రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేతలు ఆరోపించారు. శుక్రవారం చలో నంద్యాల మెడికల్ కళాశాల నిరసన కార్యక్రమానికి వెళ్తున్న డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల యువజన విభాగం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఉదయం నుంచే కర్నూలు, నంద్యాల రహదారిలో వాహనాల రాకపోకలపై పోలీసులు నిఘా ఉంచారు. బేతంచెర్ల మండలంలోకి ప్రవేశించగానే వైఎస్సార్‌సీపీ నాయకుల వాహనాలను పోలీసులు అడ్డుకుని అనుమతి నిరాకరించారు. ఈ సందర్భంగా బేతంచెర్లలో విలేకరుల సమావేశంలో డోన్ జెడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్, పార్టీ యువజన విభాగం ప్యాపిలి మండల అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. చంద్రబాబు మూడు సార్లు సీఎం అయినా ఒక్క మెడికల్ కాలేజీ తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ ఐదు సంవత్సరాల్లో 17 మెడికల్ కళాశాలను తీసుకొచ్చారని, వాటిలో 3 కాలేజీలు ప్రారంభమయ్యాయని తెలిపారు. మరో 2 కాలేజీలలో 80 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రైవేటు వారికి అప్పగించడం విద్యార్థుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చుతుందని, ప్రజలతో పాటు విద్యార్థి సంఘాలు నిరసనలకు సిద్ధమవుతున్నాయని చెప్పారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు చిరంజీవి, బుగ్గన జయ చంద్రారెడ్డి, బోరెడ్డి రఘునాథ్‌రెడ్డి, ప్రేమ్ సాగర్‌రెడ్డి, పుల్లారెడ్డి, అనీల్ విగ్నేశ్వర్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ప్రతాప్, వెంకిరెడ్డి, మురళీధర్ రెడ్డి, తిమ్మ గురుడు, మద్దయ్య, శ్రీరామ్‌రెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిరసనను అడ్డుకోవడం సరికాదు

బనగానపల్లె: నంద్యాలలో శుక్రవారం తలపెట్టిన చలో మెడికల్ కాలేజీ నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి అంబటి రవి కుమార్‌రెడ్డి విమర్శించారు. బనగానపల్లెలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం వద్ద నుంచి సుమారు 300–350 మంది నంద్యాలకు బయలుదేరగా, పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు న్యాయసమ్మతంగా చేస్తున్న నిరసనలను పోలీసుల ద్వారా అణచివేయడం శోచనీయమన్నారు. ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో అధిక ఫీజులు భరించలేక పలువురు విద్యార్థులు విదేశాలకు వెళ్లిపోతున్నారని, మధ్యతరగతి వర్గాలకు మేలు చేసే గత ప్రభుత్వ నిర్ణయాలను ఈ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అమలు చేసిన పలు సంక్షేమ పథకాలు ప్రజలకు మేలు చేశాయని గుర్తు చేశారు.

22 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

కోవెలకుంట్ల: దసరా పండుగను పురస్కరించుకుని పట్టణంలోని వాసవీ కన్యాకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం తెలిపారు. 12రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. మొదటి రోజు అమ్మవారు రాజ రాజేశ్వరీదేవి, 23న కాత్యాయినిదేవి, 24న అన్నపూర్ణదేవి, 25న బాలత్రిపుర సుందరిదేవి, 26న ధనలక్ష్మీదేవి, 27న నాగాక్షిదేవి, 28న గజలక్ష్మిదేవి, 29న సరస్వతీదేవి, 30న మహిషాసురమర్దిని దేవి, అక్టోబర్ 1వ తేదీ కంచి కామాక్షిదేవి, 2న విజయలక్ష్మీదేవి, శమీదర్శనం, గ్రామోత్సవం, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 3 తేదీ తులాభారం, తొట్ల ఉత్సవం, పాన్పుసేవ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

రోజుకో రూపంలో అమ్మవారి దర్శనం

కొలిమిగుండ్ల: దసరా పండుగ సందర్భంగా ఈనెల 22 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆయా గ్రామాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలోని రాజరాజేశ్వరిదేవి ఆలయం, తిమ్మనాయినపేట వాసవీ కన్యాక పరమేశ్వరిదేవి ఆలయం, పెట్నికోట తదితర గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. రోజుకో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వేరుశనగ రైతులు మెళకువలు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

డోన్ టౌన్: జీజేజీ–32 రకం వేరుశనగను సాగు చేస్తున్న రైతులు మెళకువలు పాటించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ధనలక్ష్మి, సుధాకర్, రమణయ్య, బాలరాజు అన్నారు. శుక్రవారం స్థానిక పొదుపు లక్ష్మి భవనంలో వీసీసీ పథకం కింద ఎంపిక చేసిన రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ సునీత అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. విలువ ఆధారిత ఉత్పత్తులు అభివృద్ధి చేసుకోవాలన్నారు. వేరుశనగ ప్రస్తుతం ఊడదిగే దశలో ఉన్నట్లయితే జిప్సం వాడడం వల్ల నూనె శాతం, విత్తన పరిమాణం పెరిగి మంచి దిగుబడి వస్తుందన్నారు. చీడపీడల నివారణకు రసాయనిక మందులు వాడకూడదని సూచించారు. సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా భూసాంద్రత పెరుగుతుందని తెలిపారు. సమావేశంలో డోన్, బేతంచెర్ల, ప్యాపిలి వ్యవసాయాధికారులు శ్రీనివాసరెడ్డి, విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

కోవెలకుంట్ల: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం పెన్‌డౌన్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పుల్లయ్య, సోబార్స్, జలీల్, వినోద్ మాట్లాడుతూ.. కార్డు ప్రైమ్ 2.0లో ఆధార్ ఓటీపీ విధానంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మ్యుటేషన్ ప్రక్రియను స్టాంప్ రైటర్లే పూర్తి చేయాల్సి ఉండడంతో తప్పులు దొర్లితే తాము బాధ్యులం కావాల్సి వస్తోందన్నారు. తీవ్ర పనిభారం, సమయం వృథా అవుతోందని, సమస్యలు పరిష్కరించాలని విన్నవించుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రెండు రోజులపాటు పెన్‌డౌన్‌కు శ్రీకారం చుట్టామన్నారు. స్టాంప్‌రైటర్లు మోహన్‌రావు, బాలముని, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

బేతంచెర్ల: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఈ నెల 13వ తేదీ జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన దుర్గాపేట కాలనీకి చెందిన అజయ్ (24) శుక్రవారం కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి గజ్జి దాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు.

రక్షణగోడ ఏర్పాటు చేయాలి

బనగానపల్లె: మండల కేంద్రం నుంచి టంగుటూరు ప్రధాన రహదారి నుంచి బనగానపల్లె రైల్వే స్టేషన్‌కు వెళ్లే సిమెంట్ రోడ్డుకు రక్షణ గోడ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. రాత్రివేళల్లో రైళ్ల రాకపోకలు అధికంగా ఉండడంతో పాటు రహదారి పక్కన లోతట్టు ప్రదేశం ఉండడంతో వాహనాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు జాగ్రత్తగా రహదారి వెంట రక్షణ గోడ నిర్మించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.


రైల్వేస్టేషన్‌కు ఏర్పాటు చేసిన సీసీరోడ్డు

బనగానపల్లెలో 54.5 మి.మీ వర్షపాతం

బనగానపల్లె: మండలంలో శుక్రవారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురిసింది. 54.5 మి.మీ వర్షపాతం నమోదైంది. వరి, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలకు తడులు అందాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో నూర్పిడికి సిద్ధంగా ఉన్న మొక్కజొన్నకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

అవుకు(కొలిమిగుండ్ల): జిల్లా స్థాయి డిబెట్ పోటీల్లో అవుకు మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్ హేమీమాతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. రెండు రోజుల క్రితం నంద్యాలలో జిల్లా స్థాయి డిబెట్ పోటీలు జరిగాయి. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు మేఘన, హరి, స్పందన మొదటి స్థానం సాధించడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అలాగే సుజోష్నవి, ఇందు, లక్ష్మిరాణి వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచారని తెలిపారు. విద్యార్థులు ప్రతిభ చాటడానికి కారణమైన ఇంగ్లీష్ ఉపాధ్యాయులు విశ్వనాథ్, సురేష్, వలిని అభినందించారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంక్షిప్తం

ఆటోను ఢీకొన్న కారు

- గర్భిణి సహా నలుగురికి గాయాలు

డోన్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రి గేటు వద్ద ఆటోను కారు ఢీకొనడంతో గర్భిణితో పాటు మరో ముగ్గురు గాయపడ్డారు. ప్యాపిలి మండలం బోంచెర్వుపల్లె గ్రామానికి చెందిన గర్భిణీ సుమిత్రమ్మను వైద్య పరీక్షల నిమిత్తం ఆమె అత్త లక్ష్మీకాంతమ్మ, ఆశా వర్కర్‌తో కలిసి ఆటోలో డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొస్తున్నారు. ఆస్పత్రి గేటు వద్ద తిరుగుతున్న ఆటోను వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గర్భిణీతో పాటు ఆమె అత్త, ఆశా వర్కర్‌తో పాటు ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గర్భిణీ స్వల్ప గాయాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గాయపడినవారికి డోన్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించారు. ఈ ప్రమాదంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

డోన్ టౌన్: స్థానిక గుత్తి రోడ్డులో ఉన్న వంద పడకల ప్రభుత్వాస్పత్రి ఎదుట జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ మహమ్మద్ హనీఫ్‌కి వినతి పత్రం అందజేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజలు రహదారిని దాటేందుకు ప్రాణాలు పణంగా పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతలు, గర్భిణులు రోడ్డు దాటడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే పలు మార్లు రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు పేర్కొన్నారు.

12వ పీఆర్సీలో జాప్యం తగదు

బనగానపల్లె: 12వ పీఆర్సీని అమలు చేయాలని, బకాయిలు చెల్లించాలని, బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పెట్రోల్ బంక్ సెంటర్‌లో రణభేరి జాతలో ఆయన మాట్లాడారు. సాల్ట్ పథకం వల్ల ప్రభుత్వ విద్యారంగం దెబ్బతింటోందన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శి సత్యప్రకాష్, ప్రతాప్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుల వివక్ష పాటిస్తే చర్యలు తప్పవు

ప్యాపిలి: గ్రామాల్లో అన్ని కులాల వారు కలిసిమెలిసి పనులు చేసుకోవాలని, కుల వివక్షను పాటించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటరామిరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, జలదుర్గం ఎస్‌ఐ నాగార్జున అన్నారు. శుక్రవారం పీఆర్ పల్లి గ్రామంలో పర్యటించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. కుల వివక్ష చూపుతూ క్షవరం చేయకపోవడం, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతులు పాటించడం సామాజిక దురాచారం కిందకు వస్తుందన్నారు. అనంతరం గ్రామానికి చెందిన దళితులకు స్థానిక సెలూన్ షాపుల్లో క్షవరం చేయించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సుందర్ మాదిగ, రామకృష్ణ, పులి కేశవయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కోవెలకుంట్ల: పట్టణంలోని ఎల్‌ఎం కాంపౌండ్‌కు చెందిన ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. కాలనీకి చెందిన శేఖర్(45) పట్టణ శివారులోని వెలగటూరు రస్తాలో క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అటుగా వెళుతున్న వ్యక్తులు గుర్తించి స్థానిక ఆస్పత్రిలో చేర్పించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అన్న వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

జాగ్రత్తలతోనే సీజనల్ వ్యాధుల నివారణ


ఆల్వకొండలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

సంజామల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని.. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే నివారించవచ్చని సంజామల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. ఆల్వకొండ గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. మతాశిశు మరణాల రేటు తగ్గించడానికి వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలని సూచించారు. రక్తహీనత, అధిక రక్తపోటు, మధుమేహం, క్షయ వంటి వ్యాధులకు సమగ్ర వ్యాధి స్కానింగ్‌లు, రక్త పరీక్షలు 143 మందికి చేశామన్నారు. కార్యక్రమంలో యునాని డాక్టర్ గోకారి, డిప్యూటి హెల్త్ ఎడ్యుకేటర్ ఆఫీసర్ నారాయణ దాసు, సూపర్‌వైజర్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.